

# సంసారంలో సరిగమలు - తమస్విని



*(ప్రతి  సంసారంలోనూ వినిపించే రాగాలు..*

*కొన్ని సరదాలు, కొన్ని సరాగాలు,*

*కొన్ని సరసాలు, ఇంకొన్ని విరసాలు, మరికొన్ని విషాద గీతాలు..*

*వెరసి సంసారంలో సరిగమలు..!)*

## మృగతృష్ణ

**"ఇంట్లోనే ఉన్నావా?** అరగంటలో వస్తాను. నీతో మాట్లాడాలి."

నేను మరోమాట మాట్లాడకుండా హసిత ఫోన్ పెట్టేసింది.

ఇక షాపింగ్‌కి వెళ్ళే ఆలోచన విరమించుకున్నాను.

హసిత స్కూల్లో నా క్లాస్‌మేట్. నా ప్రమేయం లేకుండా తనంతట తనే నాతో స్నేహం చేసింది. ఉప్పెనలా చాలా వేగంగా, ఆలోచించడానికి సమయంలేనంతగా నన్ను చుట్టేసింది. నాకు తెలిసే సమయానికి హసిత నా ప్రాణస్నేహితురాలైంది.

వాళ్ళనాన్న ఓ ప్రభుత్వరంగ సంస్థలో గుమాస్తా అయినా ఆయనకి వచ్చే లంచాలతో ఆఫీసర్ల కన్నా ఎక్కువ లగ్జరీలతో జీవిస్తారు వాళ్ళు. తనుకూడా 'మీ నాన్న ఎక్కడ పని చేస్తారు?' అంటే సంస్థ పేరు చెప్తుంది కాని హోదా చెప్పదు. దాన్ని చూసి ఆ వివరం అడిగే సాహసం కూడా ఎవరూ చేయరు.

అందరికీ డబ్బు పిచ్చి ఉంటుంది. కానీ హసితకి అది ఓ రెండు రెట్లు అధికంగా ఉండి, ఓ మానసిక జాడ్యం అయింది. ఒక్కొక్కసారి దాని కబుర్లు వింటూంటే చిర్రెత్తుకొస్తుంది. ఏభైవేల రూపాయల హేండ్‌బేగ్, ఇరవైవేల స్కర్ట్ ఇలా ధరలు చెప్తూ వాటి ఫోటోలు పంపుతూంటుంది.

"అవి బాగున్నాయా? అని అడగడానికి పంపుతావా? లేక అంత ఖరీదైనవి కొనుక్కున్నాను అని చెప్పడానికి పంపుతావా?" ఓ రోజు అడిగాను.

"అయ్యోకాదు. ఎలా ఉన్నాయని అడగడానికే. మా సొసైటీలో ఏభైవేల హాండ్‌బేగ్ లేకపోతే కలుపుకుపోరు తెలుసా? ఐ మీన్ వెలేస్తారు" చెప్పింది.

నేను ఆశ్చర్యపడి అడిగాను.

"మీ సొసైటీ అంటే ఏమిటి? మీ నాన్న కొలీగ్స్ ఫేమిలీస్ అయితే అంతా క్లర్క్స్. మీ పేరెంట్స్ తరఫు చుట్టాలైతే అంతా మిడిల్ క్లాస్. నీ ఫ్రండ్స్ అంటే మేమే. నేనెప్పుడూ అది వినలేదు. అంత ఖరీదైంది కొనలేదు. ఇవికాక ఇంకా ఏ సొసైటీ ఉంది నీకు?"

హసిత మొహం ఎర్రబడింది. ఏం చెప్పాలో తెలియక మాటలకి తడుముకుంది.

"నువ్వు కొనుక్కోకపోయినా మీరెంత రిచ్చో అందరికీ తెలుసు." నిష్టూరంగా చెప్పింది.

మా నాన్న అధికార పార్టీ యం.ఎల్.ఏ. మా అమ్మ కార్పొరేటర్. మాకు కుటుంబవ్యాపారాలు కూడా ఉన్నాయి. అందుకే హసిత నా వెంటపడి నా స్నేహాన్ని సంపాదించిందని నాకు తెలుసు. ఆమెలోని ఈ డబ్బు కాపీనం చూస్తే జాలి నాకు.

ఇద్దరం ఇంటర్మీడియెట్ ఆర్డనరీ ఫస్ట్‌క్లాస్‌లో కష్టపడి పాసై, పేరున్న ఓ ఇంజనీరింగ్ కాలేజీలో మేనేజ్‌మెంట్ సీట్లు కొనుక్కున్నాం. కాలేజ్ మొదలైన వారానికి దూరంగా ఉన్న ఓ అబ్బాయిని చూపించి అడిగింది.

"అతనెవరో తెలుసా?"

"కోతిలా ఉన్నాడు. ఎవరైతే నాకెందుకు?" చెప్పాను.

"వాళ్ళ నాన్న పెద్ద బిల్డర్. హైదరాబాద్‌లోని టాప్ టెన్ రిచ్ వాళ్ళలో ఒకరు."

"ఓ!" ఉదాసీనంగా చెప్పాను.

"ఓ ఏమిటి? కోటీశ్వరుడంటుంటే. ఇలాంటివాడు గనక నన్ను ప్రేమించి పెళ్ళి చేసుకుంటే. ఓ మైగాడ్!" పారవశ్యంగా చెప్పింది.

"నీ మొహం. తెల్లారి లేవగానే కనపడేది కోట్లుకాదు కోతి మొహం." చిరాకుపడ్డాను.

కానీ హసిత అతని స్నేహం కోసం వెంపర్లాడినా ఆ అబ్బాయి దీన్ని పట్టించుకోలేదు. దాంతో 'కోతి చచ్చినాడు' అని తిట్టిపోసింది.

కాలేజ్‌లో చేరగానే మా నాన్న నన్ను, నా తమ్ముడ్ని పిలిచి సీరియస్‌గా చెప్పారు. "ఎప్పటికైనా మంత్రిని కావాలని నా కోరిక. మీరు ప్రేమలు, దొమ్మీలు అంటూ వెధవ్వేషాలు వేసారంటే చంపేస్తాను జాగ్రత్త. ఇంటిని చక్కదిద్దలేనివాడు రాష్ట్రాన్ని ఏం చక్కదిద్దుతాడు అంటారు."

దాంతో బుద్ధిగా కాలేజ్‌కి వెళ్ళిరావడం తప్ప నేను అబ్బాయిలతో మాట్లాడే ప్రయత్నం చేయలేదు. సామాన్యమైన రూపురేఖలతో ఉండే నామీద వాళ్ళకీ ఆసక్తి కలగలేదు కానీ హసిత చెప్పే మాటలు నాకు చాలా బావుండేవి. ఇంజనీరింగ్ నాలుగేళ్ళు ఓ రిచ్ బాయ్‌ఫ్రెండ్ దొరుకుతాడేమోనని తెగ వెదికింది. కొన్ని ప్రేమలు రెండు సినిమాలదాకా వచ్చిపోయేవి. ఆ అబ్బాయిలని తిట్టిపోసేది.

ఇంజనీరింగ్ అవగానే నాన్న నా పెళ్ళి చేసేసాడు. అతనిది కూడా బిజినెస్ ఫేమిలీనే. సుమారుగా ఉంటాడు. ఉద్యోగం చేయడం అవసరంలేదు, అంత సమర్ధతకూడా లేదు కాబట్టి హాయిగా గృహిణిగా స్థిరపడి షాపింగ్స్, కిట్టీపార్టీలలాంటి వాటితో బిజీ అయిపోయాను.

హసిత యం.ఎస్ చేయడానికి ఆస్ట్రేలియా వెళ్ళింది. రెండేళ్ళ తర్వాత హైదరాబాద్ తిరిగి వచ్చి ఫోన్ చేసింది. ఆ సాయంత్రం ఓ అబ్బాయిని తీసుకుని మా ఇంటికి వచ్చింది.

"ఇతని పేరు రోహిత్. వీళ్ళకి ఫార్మా కంపెనీ ఉంది" చెప్పింది.

"సరే. ఇంతకీ ఎవరు?" నవ్వాను.

"నాతో యం.ఎస్ చదివాడు. మంచబ్బాయ్" మురిపెంగా చెప్పింది. అతను సిగ్గుపడ్డాడు.

"పెద్దవాళ్ళకి చెప్పి పెళ్ళిచేసుకోవాలి. అదే ఇప్పుడు మా టార్గెట్" చెప్పింది.

సన్నగా, లేతగా ఉన్న రోహిత్ బావున్నాడు. హసితకన్నా చిన్నగా ఉన్నాడు. అమాయకంగా కనిపిస్తున్నాడు.

"ఆల్ ది బెస్ట్" చెప్పాను.

హసిత తల్లితండ్రులు ఒప్పుకున్నా రోహిత్ తల్లితండ్రులు ఈ పెళ్ళికి ఒప్పుకోలేదు. ఆర్నెల్లు ప్రయత్నించిన రోహిత్ ఓ రాత్రి స్లీపింగ్ పిల్స్ మింగేసాడు. హాస్పిటల్‌లో మూడు వారాలుండి క్షేమంగా ఇంటికి వచ్చాడు. భయపడ్డ అతని తల్లితండ్రులు అయిష్టంగానే హసితతో పెళ్ళికి ఒప్పుకుని, పెళ్ళయ్యాక వాళ్ళిద్దరినీ గేటెడ్ కమ్యూనిటీలోని ఓ విల్లాలో ఉండమని పంపేసారు.

రోహిత్ తండ్రి కంపెనీలోనే పనిచేయసాగాడు. హసిత నాలాగే గృహిణిగా మారింది. నాకన్నా ఎక్కువ వ్యాపకాలు సృష్టించుకుంది.

"అంత చదువుకున్నావు. ఏదైనా జాబ్ చేయచ్చుగా? లేదా రోహిత్ వాళ్ళ కంపెనీలోనే పనిచేయచ్చు. ఎందుకు టైం వేస్ట్ చేస్తావు?" ఓసారి అడిగాను.

అది నా వంక ఎర్రగా చూసి అడిగింది.

"మరి నువ్వు చేయడంలేదే?"

ఆ రోజునించి హసితతో మాటలు తగ్గించాను.

మళ్ళీ ఇన్ని రోజుల తర్వాత వస్తానంది. మరి ఏ సమస్య వచ్చిందో, సాధ్యమైనంత తక్కువ మాట్లాడాలి. సలహాలు అసలు ఇవ్వకూడదు నాకు నేనే చెప్పుకున్నాను.

చెప్పినట్లుగానే అరగంటలో వచ్చింది. రాగానే నన్ను గట్టిగా హత్తుకుని "ఎన్నిరోజులైందే నిన్నుచూసి?" అన్నది.

నేనేం మాట్లాడలేదు.

"మొత్తానికి అంకుల్ సాధించారు. మినిస్టరైపోయారు." చెప్పింది.

"అందుకోసం వచ్చావా? ఐమీన్ కంగ్రాట్స్ చెప్పడానికి" అడిగాను.

"లేదు. పర్సనల్ ప్రాబ్లంతో వచ్చాను. నీ సలహా కావాలి... నాకు రోహిత్ బోర్ కొట్టాడు." విసుగ్గా చెప్పింది.

నిర్ఘాంతపోయాను.

"ఎందుకు? రోహిత్ నీకంటే మంచబ్బాయ్. చెడిపోయాడా ఏమిటి?" తేరుకుని అడిగాను.

"నా తలకాయ్. వాడికంత ధైర్యం కూడానా? ఆ మంచితనాన్ని భరించలేకపోతున్నాను. మన్ను తిన్న పాములా, ఆ నెమ్మది.. హారిబుల్. గోడమీది బల్లికి, వాడికి తేడాలేదు. ఇద్దర్ని పట్టించుకోనక్కర్లేదు. డంబ్ హెడ్" చిరాగ్గా చెప్పింది.

"అయ్యో! అంత మాటనకు." నొచ్చుకున్నాను.

"వాళ్ళ నాన్న నెలకి రెండు లక్షలిస్తాడు. ఏ మూలకీ చాలదు. ఇంకో లక్ష ఎక్కువ ఇవ్వమను అంటాను. అడగను. సర్దుకుందాం అంటాడు. వాళ్ళ నాన్నకి ఎదురు చెప్పను అంటాడు. మా పెళ్ళి విషయం తప్ప ఇంక ఏ విషయంలోనూ వాళ్ళ పేరెంట్స్‌కి ఎదురు చెప్పలేదుట. అదీ చెప్పక పోతే నా ప్రాణానికి హాయిగా ఉండేది." పళ్ళు కొరికింది.

"అంటే నిన్నంతగా ప్రేమించడనికదా అర్థం? అందుకు నువ్వు హేపీగా ఫీలవ్వాలి" చెప్పాను.

"అదే సుప్రీత్ అయితే ఎంత డేరింగ్ అండ్ డేషింగ్ ఉంటాడో తెలుసా?" పారవశ్యంగా చెప్పింది.

నేను మరోసారి నిర్ఘాంతపోయాను.

"మధ్యలో ఈ సుప్రీత్ ఎవరు?"

"మా కమ్యూనిటీలోనే ఉంటాడు. పంజాబీ. ఐ.పి.యస్‌కి సెలక్టయ్యాడు. రోజూ ఇద్దరం ఒకే టైంకి జిమ్‌కి వెళ్తాం. అలా పరిచయం. ఏం బాడీనో! ఆ ఫిజిక్ సినిమా హీరోలకి కూడా ఉండదు. నాకు పెళ్ళైయిందని నాకంటే ఎక్కువ బాధపడ్డాడు. మొన్నొకసారి అతని బైక్ మీద రాత్రి ఒంటిగంటకి మినీ బ్రూవరీకి వెళ్ళాను తెలుసా?" కళ్ళు మెరుస్తూండగా చెప్పింది.

"రాత్రి ఒంటిగంటకా? మరి రోహిత్ ఊరుకున్నాడా?"

"వాడి బొంద. పదయ్యేసరికి వాడికి కళ్ళు మూతలు పడతాయి. నేను వెళ్ళిందీ తెలీదు. వచ్చిందీ తెలీదు." నిరసనగా చెప్పింది.

"నువ్వు చాలా తప్పు చేస్తున్నావు హసితా. మీ మామగారిది చాలా పరువుగల ఫేమిలీ. ఎవరైనా చూసి చెపితే వాళ్ళకి ఎంత అవమానమో తెలుసా? ఐనా పెళ్ళయింది. రోహిత్ మంచివాడు. నువ్వు కోరుకున్నట్లే రిచ్‌ఫెలో. మళ్ళీ ఈ వెర్రివేషాలేమిటి?" తీవ్రంగా అడిగాను.

"నాకు వాడు వద్దు. వదిలించుకుందాం అనుకుంటున్నాను. డివోర్స్ అడిగాను. ఏడ్చాడు. కాళ్ళు పట్టుకున్నాడు. జాలేసింది. కానీ నాకు చాలా అసంతృప్తిగా ఉంటోంది. ఈ మంచి బాలుడు నాకు వద్దు. సుప్రీత్‌లాంటి ఏక్టివ్ పర్సన్ కావాలి. ఏం చేయాలో తోచక నీదగ్గరకి వచ్చాను." సోఫాలో చేరగిలబడింది.

నాకు హసితని చూస్తే భయమేసింది. ఈ అమ్మాయికి తనకేం కావాలో స్పష్టంగా తెలుసా? గుమస్తాకి పుట్టిన హసితకి రోహిత్ చాలా ఎక్కువ. అలాంటివాడిని పువ్వుల్లో పెట్టి చూసుకోవాలి నిజానికి. చదువుకునేప్పుడు ఇద్దరు ముగ్గుర్ని ప్రేమించిందంటే చిన్నతనం అనుకోవచ్చు. కానీ ముప్పైదాటాక ఫిజిక్‌ని చూసి, ఐపిఎస్‌ని చూసి ప్రేమించడమేనా? అది నిజంగా ప్రేమేనా? రేపు ఇంకో ఐఏఎస్ కనపడితే వాడితో వెళ్తుందా? సుఖాల అన్వేషణలో హసితకి తనేం పోగొట్టుకుంటోందో తెలియడంలేదు అలాగే తన దగ్గరున్న పెన్నిధికూడా తెలీడంలేదు.

"చెప్పు ఏం చేయను?" అడిగింది.

"ఇది చాలా సున్నితమైన సమస్య హసితా. ఎవరికి వాళ్ళు నిర్ణయించుకోవాలి. రోహిత్‌కి విడాకులిస్తే సుప్రీత్ నిన్ను పెళ్ళి చేసుకుంటాడా?" అడిగాను.

"ఎగిరి గంతేసి" చెప్పింది.

"సారీ. నాకేం తట్టడం లేదు. చిన్నప్పటినించి నాకు కొంచెం లోకజ్ఞానం తక్కువ." సంజాయిషీగా చెప్పాను.

నాలుగు నెలల తర్వాత ఓ ఫంక్షన్‌లో నాకు హసిత కనిపించింది. పక్కనే రోహిత్ కూడా ఉన్నాడు. ఏకాంతం దొరికినప్పుడు చెప్పింది.

"సుప్రీత్ కూడా దొంగ చచ్చినాడే చెప్పకుండా గాయబ్. బీహార్‌లో పోస్టింగ్ వచ్చింది వెళ్తున్నానని జిమ్‌లో వాళ్ళకి చెప్పాట్ట. నాకు చెప్పలేదు. కుక్కపిల్లలా నా వెంట తిరిగాడు వెధవ. నయం అడ్వాన్స్ అవడానికి ట్రై చేసాడు కానీ ప్రైవసీ దొరకలేదు."

"ఇంకెప్పుడూ ఇలాంటి వాళ్ళని చూసి బంగారంలాంటి రోహిత్‌ని ఏడిపించకు." చెప్పాను.

కానీ దానికి ఆ అవకాశం రాలేదు. ఈ విషయం చూచాయగా తెలిసిన హసిత మామగారు ఉగాండాలో బ్రాంచ్ ఓపెన్ చేసి రోహిత్‌ని, హసితని దాని వ్యవహారాలు చూసుకోమని పంపేసారు.

"ఇక్కడంతా నల్లగా లావుగా భయంపుట్టేట్టు ఉన్నారే. కటిక పేదవాళ్ళు పాపం." వెళ్ళిన కొత్తల్లో ఓసారి ఫోన్ చేసి చెప్పింది. 'రోహిత్ నిశ్చింతగా ఉండొచ్చు ఇక.' నవ్వుకున్నాను.

(ఇది నిజంగా జరిగిన కథ. హసితకి తెలుగు బుక్స్ - అసలు ఏ పుస్తకాలు చదివే అలవాటు లేదు కాబట్టి ధైర్యంగా రాసేసాను.)

***(వచ్చే సంచికలో మరో సరిగమ)***

Click here to share your comments